
# అతిథిదేవుడు



**శ్రీరాజ్**

'పనికిమాలిన, దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ....' బాబూరావుకి కోపం వచ్చినా, సంతోషం వచ్చినా ఆ డైలాగుని విడిచి పెడతాడు.

ప్రస్తుతం అతనికి కోపం వచ్చింది. భార్యమీద విరుచుకుపడ్డాడు.

అతను ఆఫీసుకి వెళ్లేముందు రెండో మారు కాఫీ యిచ్చింది, కాంతం. చాలా ప్రేమగా యిస్తుంటే, కాదనలేక పోయాడు, బాబూరావు.

"బుజ్జిముండ ఎలా ఉందండీ?" కాంతం మురిసిపోతూ అడిగింది.

"ఎవరా బుజ్జిముండ?" బాబూరావు ఆశ్చర్యంగా చూశాడు.

"కనబడ్డంలే.... ఎంచక్కా ముద్దుగా బొద్దుగా ఉందో, చూడండీ.... మీ చేతిలో తళతళ మెరిసిపోతుంది."

అతని చేతిలో 'స్టీలు గ్లాసు' బుజ్జి ముండన్న మాట.

"కాంతం! నీ పిచ్చి ముదురుతుంది. అవసరం ఉన్నా, లేకపోయినా స్టీలు పాత్రలు కొని, ఇంటిని దుకాణం చేయడం ఏమీ బావులేదు. ఏంవైనా అంటే ముచ్చటపడి తీసుకున్నా నంటావు.... పనికిమాలిన, దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ— నీ ముచ్చటకి నా సంపాదన సరిపోవడంలేదు."

తాగుతున్న కాఫీ మధ్యలో విడిచి పెట్టేశాడు.

"అదిగో.... అదిగో! మీ యిష్టం వచ్చినట్లు మాటాడితే నే నూరుకోను. ఇంటినిండా లక్ష్మిదేవిలా స్టీలు సామానుంటే ఆ ఇల్లాలికి ఎంత గౌరవమో మగవాళ్లు మీకేం తెలుసు?.... మనింట్లో ఈ సంపద ఉండబట్టే— ఈ వీధిలోని అమ్మలక్కలు నన్నెంతో మర్యాదగా చూస్తారు. పెళ్లిళ్లకి పేరంటానికి నన్ను ప్రత్యేకంగా పిలుస్తారు. చివరికి నాతో మాట్లాడ్డానిక్కూడా భయపడతారండీ. ఇంకా చెప్పాలంటే...."

కాంతం గొప్పగా చెప్పుకుపోతుంటే, అతనికి ఒళ్లుమండి మధ్యలో బ్రేక్ వేశాడు.

"చాలు, నీ గొప్పలు.... అసలు నువ్వు చాలా చాలా ఘోరాలు చేస్తు

న్నావు. ఈ ఇంటి పరువూ మర్యాదా నాశనంచేస్తున్నావు."

బాబూరావు పళ్లు పటపట కొరుకుతుంటే, ఆమె మూతి వంకర తిప్పి, కంయ్ మంది.

"ఘోరాలూ.... పరువూ మర్యాదలూ.... ఆహా....నిందారోపణ చేయడం కాదండీ.... ఏంవిటో చెప్పగలరా?"

లోపలి గదిలో స్పెషల్ తెలుగు చదువుకుంటున్న కొడుకుని అతను పిలిచాడు. రాజా యింటరు చదువుతున్నాడు. వాళ్ల నాన్నకి మంచి సపోర్టు. ఆ అబ్బాకొడుకులు— కాంతం చేస్తున్న ఘోరాల లిస్టొకటి తయారుచేశారు.

ఆ ఘోరాల లిస్టు సారాంశం యిది:

అనవసరంగా అదే పనిగా, స్టీలు గిన్నెలు కొనడం పనికిమాలిన ఘోరం. చేతిలో డబ్బు ఖర్చుచేసి, అప్పుడప్పుడు యింట్లో వస్తులు పెట్టడం దరిద్రగొట్టు ఘోరం. అరువులు పెట్టి, వాళ్లచేత అనిపించుకోవడం పింజారీ ఘోరం. అప్పులు చేసి, వడ్డీలు పెంచడం ఛండాలపు ఘోరం. కేవలం వీధిలో వాళ్లకి స్టీలు పాత్రలు చూపించడం కోసమే వ్రతాలు, వారాలు చేయడం యూస్‌లెస్ ఘోరం. సదరు వ్రతాలకని, వారాలకని వేలకు వేలు వృధాచేయడం డర్టీ ఘోరం. వచ్చినవాళ్ల దగ్గర స్టీలు కానుకలు ఆశించడం బ్లడీ ఘోరం. గొప్పకోసం ఇరుగుపొరుగులకు పెద్ద పెద్ద ఉక్కు బహుమతులు చదివించడం నేస్టీఘోరం.

ఆ ఘోరాల లిస్టు చదివి, వాళ్లమ్మకి వినిపించాడు రాజా.

"అమ్మా! నీ అక్రమానికి, అన్యాయానికి, అవివేకానికి, అజ్ఞానానికి, అనాలోచనకి, అహంకారానికి అతి తొందరలో మనింట్లో విప్లవం వచ్చేస్తుంది." రాజా నోటితో శంఖం ఊదాడు.

"కాంతం! నీ పద్ధతి పూర్తిగా మార్చుకోవాలి. లేపోతే— నీ మీద సామూహికంగా నిరసన చేయాల్సొస్తుంది. అం.... ఛే క్కేర్...." అంటూ రుస రుస లాడుతూ బాబూరావు అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

"ఏరా, రాజా! నా మీద విప్లవశంఖం పూరిస్తావా? వెధవా!.... గ్లాసుతో కొడితే తల చెక్కలవుతుంది." కాంతం స్టీలు గ్లాసు కొడకుమీదికి ఎత్తింది.

"అమ్మా! నన్ను కొట్టకే.... క్రికెట్టు అడితే నీ బుజ్జిముండ సొట్టలు పడుతుంది. గ్లాసు డౌన్.... గ్లాసు డౌన్...." రాజా తప్పించుకు పారిపోయాడు.

కాంతం సన్నగా నవ్వుకుంది.

అదేంవిటో— చిన్నప్పట్నుంచి తనకి స్టీలు వస్తువులంటే ఎంతో యిష్టం. బంగారపు నగలు, బనారసు చీరలు తన ఆలోచనల్లో ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ఆ ఇంట్లో రకరకాల స్టీలు సామగ్రి సమకూర్చింది. తనకి నచ్చినవి, ఎవరి దగ్గరా లేనివి— ఎంత డబ్బయినా పెట్టి, తీసుకుంటుంది. కొన్ని వస్తువులకి ఫోటోలు తీయిస్తుంది. వాటి పేర హిస్టరీ షీట్సు మెంటేయిన్ చేస్తుంది. అవకాశం కుదరడం లేదుగాని ఇంటి గోడలన్నీ స్టీలుతాపడం చేయించాలని మహా కోరికగా ఉంది. స్టీలుని కనిపెట్టిన మహానుభావుడికి మనసులో జోహర్లు చెబుతుంది.

ఒకరికి డబ్బు పిచ్చి. వేరొకరికి పేరు పిచ్చి. ఇంకొకరికి ప్రేమ పిచ్చి. మరొకరికి మందు పిచ్చి. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో పిచ్చి ఉన్నట్లే— కాంతంకి స్టీలు అంటే ఉక్కుచిప్పలు సేకరించడం పిచ్చి.

అది బాబూరావు కామెంట్ సుమండీ.

* * *

మరో గంటలో బాబూరావు వేదిక మీద మైకుముందు నిలబడి ఆధునిక నాటక రంగం మీద రసవత్తరమైన ఉపన్యాసం యిస్తాడు. అడిటోరియంలో ప్రేక్షకులు మిన్ను విరిగి మీదపడేలా చప్పట్లు దడ దడా కొడతారు. స్టేజీ మీద ఉండే మంత్రిగారు, నాటక రంగ పితామహులు తనని అభినందలతో ముంచేస్తారు.

సెంట్ పెర్సెంట్ హడావుడిగా బాబూరావు అద్దంముందు కూర్చొని, తల దువ్వుకుంటున్నాడు.

కాంతం వంటింట్లో స్టీలు డబ్బాలో పోపులు తీసి, స్టీలు కళాయిలో వేసి, స్టీలు గరిటతో కదుపుతూ ఉండగా— ఓ పెద్దకేక వినిపించేసరికి కాసేపు స్టిల్లయిపోయింది.

రాజా షెడ్‌లో ఉన్న బజాజ్ చేతక్ని బయటకు తీసి, గేటు దగ్గర స్టేండు వేసి, కాటన్‌తో బంపరు తుడుస్తూ ఉండగా— ఓ పెద్దకేక వినిపించే సరికి కాసేపు కంగారు పడ్డాడు.

అంత పెద్దగా కేక వేసింది, నూటికి నూరుపాళ్లు బాబూరావే.

తల్లీకొడుకులు గాబరాగా పరుగు పెట్టారు.

"నాన్నగారూ! ఏంవయిందండీ.... కరెంటు షాక్ కొట్టిందా?" ఇంకా రాజా రొప్పుతూనే ఉన్నాడు.

"అమ్మో! దెయ్యం ఏదైనా వాలిందా అండీ?" కాంతం గుండె దడదడమంటుంది.

వాళ్లు ఊహించినట్లు బాబూరావుకి కరెంటు షాక్ ఎక్కువ కన్న షాకే తగిలింది. దెయ్యం వాలిందాని కన్న ఎక్కువగానే ఊగిపోతున్నాడు.

"ఆ హేంగరుకి తగిలించిన నా వైట్ ప్యాంటు.... ఫారిన్ గాబర్డీన్ ప్యాంటు ఏంవయింది? గుడ్లు పెద్దవిచేసి, మహా ఉద్రేకంగా భార్యను గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

'అమ్మయ్యా!' అనుకొని, రాజా కుదుటపడ్డాడు. 'ఇంతేనా' అనుకొని, కాంతం కదలబోయింది. బాబూరావు

ఊరుకోలేదు. మళ్లీ అదే ప్రశ్న మాటకీ మాటకీ మధ్య గేప్ యిచ్చి, అడిగేడు.

"మరేమో... నెలాఖరు రోజులు..." కాంతం నసిగింది.

"నే నడుగుతుంది నా ఫారిన్ గేబర్డీన్ ప్యాంటు గురించి... నెలాఖరు రోజులు గురించి కాదు." బాబూరావు రెట్టించాడు.

రాజాకి కేసు అర్థం అయిపోయింది.

"అయ్యో, నాన్నగారూ! మీరెంత అమాయకులండీ.... నెలాఖరు రోజు లందు అప్పుపుట్టదని, అరువు దొరకదని అర్థం.... పాత బట్టలకి స్టీలు గిన్నె లిస్తారని మీకు తెలుసా?.... అంచేత- అమ్మ ఏ స్టీలు వస్తువు కోసమో బంగారం లాంటి మీ ప్యాంటును.... అహ.... ఇది నా డౌటు సుమండీ...."

బాబూరావుకి దుఃఖం ముంచు కొచ్చింది.

"అన్యాయం.... అన్యాయం. ఈ రోజు ప్యాంటయింది. రేపు నిన్నూ నన్నూ కలిపి ఆ స్టీలుసామాన్లవాడికి మీ అమ్మ అమ్మేస్తుందిరా."

"అంత పని మాత్రం చెయ్యకే అమ్మా!.... మా క్రికెట్ టీమ్‌కి నేనే కెప్టెన్ని."

అలాంటి సమయాల్లో ఎలా నెగ్గుకు రావాలో కాంతానికి బాగా తెలుసు. ఉష్ణం ఉష్ణేన శీతలః అన్నట్లు- కోపానికి కోపం ప్రదర్శించడం సరైన మందు.

"అవును. అమ్మితే, అమ్మేస్తాను. నా యిష్టం. ఏం, నా గాజులు అమ్మి, మీ అమ్మాయి చదువుకోసం డబ్బు పంపించ లేదా? ఆరోజు నేనేమైన అడిగానా?..."

"ఒసేవ్.... ఇన్ని పాపాల ఫలితంగా నువ్వు నిజంగా నరకానికే పోతావు. అక్కడ యమభటులు నిన్ను రంపాలతో బరబరా కోసేస్తారు."

"పోనెండి. చాలా పుణ్యాలు చేస్తు న్నందుకు మీరు స్వర్గంలో జయమాలిని జ్యోతిలక్ష్మిలతో కులుకుదురుగానిలెండి."

"ఛప్.... నోర్ముయ్. నే నిప్పుడు సభకి ఎలా తగలడాలి?"

"తెలుగుతనం ఉట్టిపడేలా చక్కగా పంచ కట్టుకొని మరీ వెళ్లండి. అయినా, సభలకి సన్మానాలకి ఎవరైనా ప్యాంటూ గింటూ వేసుకుంటారా?"

బాబూరావు సినికల్‌గా తల పీక్కు న్నాడు.

మొండితనం సిగ్గు లేకుండా పకపకా నవ్వుతుంది. చేతగానితనం సిగ్గు లేకుండా వలవలా ఏడుస్తుంది.

"ఇక లాభం లేదు. ఇప్పుడే ఈ క్షణంలోనే నీ మీద నిరసన ప్రకటిస్తు న్నాను. పనికిమాలిన, దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ ఉక్కు చిప్పల్లో నువ్వేదిచ్చినా నేను ముట్టను. నీ బుద్ధి మారేవరకూ నా నిరసన కొనసాగుతుంది."

అతని శపథం స్టీలంత దిట్టంగా ఉందని కాంతం విరగబడి నవ్వింది.

* * *

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఆంగ్లంలో వార్తలువినడం బాబూరావుకు మహా యిష్టం. మంద్రస్థాయిలో వాల్యూమ్‌చేసి, రేడియో దగ్గరగా చెవి పెట్టి, వార్తలు ఆలకిస్తున్నాడు.

బయట దడదడా తలుపు చప్పుడు అయింది. బజ్జరు కూడా ఒకటే మోతగా వినిపిస్తుంది.

బాబూరావు రేడియో ఆఫ్‌చేసి, వీధి తలుపు తీశాడు. ఓ శాల్తీ దబ్బున అతని కాళ్ళమీద పడిపోయింది. 'బాబూ బాబూరావుగారూ! నా సంసారాన్ని నిలబెట్టండి' అని వలవల ఏడ్చేస్తూ, బాబూరావు కాళ్ళను తన కన్నీళ్లతో ప్రక్షాళన చేస్తుంది.

బాబూరావు యిబ్బందీ, చిరాకూ పడిపోతూ- ఆ శాల్తీని రెక్కపుచ్చు కొని, మీదికి లేవదీశాడు.

ఒన్‌టౌన్‌లో, రెండో వీధిలో, మూడో వరసలో, నాలుగో యింట్లో, అయిదో వాటాలో ఉంటున్న అతన్ని, అతని కళ్ళలో ధారాపాతంగా వస్తున్న కన్నీటిని చూసి, బాబూరావు ఒకింత ఆశ్చర్యపోయి- 'ఓరి, నువ్వా?....' అంటూ మధ్యలో ఆగిపోయాడు.

"అవునండీ. నేనండీ... శివరావుని... శివరాత్రి శివరావునండీ.... నా సంసా రాన్ని నిలబెట్టండి." బాబూరావు రెండు చేతుల్ని పట్టుకొని, తన గుండెల దగ్గరికి చేర్చుకున్నాడు శివరావు.

"నేను సంసారాలు నిలబెట్టే కాంట్రాక్టర్‌ని కాదయ్యా! ఇలాంటి కెందర్లు నాకు చెప్పకు."

"అసలు విషయం వినండి. ఒక స్టీలు కంచం మా యిద్దరి మధ్య తగువు పెట్టి, గొడవలు తెచ్చి, దూరం పెంచి, చివరికి విడాకులు కోర్టు వరకు దారి తీసిందండీ...."

"ఏవన్నావ్- ఒక స్టీలు కంచమా?.... పనికిమాలిన దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ స్టీలు కంచమా?...."

"ఆం.... ఆ స్టీలు కంచమే నా కొంప కూల్చింది. అసలేం జరిగిందంటే ...."

శివరావు చెప్పిన ఫ్లాష్‌బేక్ కథ యిది:

ఆ రోజు ఆదివారం. శివరావుకి చతుర్ముఖ పారాయణం అంటే మహా యిష్టం. పేకాడ్డానికి బొత్తిగా చేతిలో డబ్బుల్లేక వాళ్లింట్లోనే దొంగతనం చేశాడు. నగలూ నట్రా, డబ్బూ, దస్కం దొంగతనం చెయ్యలేదు. ఒకే ఒక స్టీలుకంచం వాళ్లావిడ కళ్ళు కప్పి, ఎత్తుకొచ్చి, కాంతంగారికి అమ్మేశాడు.

అది అలాటిలాంటి స్టీలుకంచం కాదు. దానిక్కూడా ఓ ఫ్లాష్ ఉంది. శివరావు మరదలు- అమెరికాలో ఏరి, కూర్చి, కొని ఇండియాలో ఉంటున్న శివరావు

దంపతులకు_ ఒకానొక వెడ్డింగు యూనివర్సరీకి ఆ కంచాన్ని బహుమతిగా పంపింది. అందమైన పళ్లెం. అద్భుతమైన పోత. మొగుడూ పెళ్లాం ఫిఫ్టీ ఫిఫ్టీ అందులో హాయిగ్గా భోంచెయ్యవచ్చు. పుష్పకవిమానంలా ఎన్ని వడ్డనలు చేసినా, మరో అయిటంను అకామిడేట్ చేస్తుంది. అంత నావల్టీ ఉంది గనకే కాంతం పది రూపాయలు ఎక్కువ యిచ్చి, శివరావు దగ్గిర కొంది.

ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడంటారు గాని శివరావుని వాళ్లావిడే బలే గమ్మత్తుగా పట్టుకుంది. దొంగతనం చేసిన స్టీలుకంచం తెచ్చినప్పుడే ఇంటికి రమ్మంది. లేపోతే, కోర్టులో కలుసుకోమంది.

దాంతో శివరావు గుండెలు బాదుకుంటూ నిశ్శబ్దమూ, నీరసమూ అని ఆలోచించకుండా బాబూరావు కొంపమీద పడ్డాడు.

"బాబూ బాబూరావుగారూ! అదండీ కథ. అక్కయ్యగారితో విషయం అంతా చెప్పుకున్నాను. తన డబ్బు తీసుకొని, నా స్టీలుకంచం తిరిగి యిమ్మన్నాను. ఛఛ.... ఇవ్వను పొమ్మన్నారు.... నా సంసారాన్ని నిలబెట్టండి." శివరావు మళ్ళీ ఏడుపు రికార్డు వేశాడు.

"ఏంవయ్యా! పేకాడతావా? ఇంట్లోనే కన్నం వేస్తావా? పైగా నీ దొంగసరుకు అమ్మటానికి మా యిల్లే దొరికిందా?" గట్టిగా బాబూరావు గదమాయించాడు.

"అక్కయ్యగారు స్టీలు తాకట్టు పడతారు. ఖరీదుకి కూడా తీసుకుంటారు."

"ఏంవిటీ, మా ఆవిడ ఈ వ్యాపారం కూడా చేస్తుందా?"

బాబూరావుకి మతిపోయింది. కాంతం చేస్తున్న ఘోరాల లిస్టులో సంఖ్య మారింది.

"అబద్ధం కాదండీ.... ఈ వీధిలో, పక్క వీధిలో, ఒన్ టవున్లో, టూ టవున్లో త్రీ టవున్లో అందరికీ తెలుసండి.... నా సంసారాన్ని నిలబెట్టండి."



"ఛస్.... అరిగిపోయిన గ్రాంఫోను రికార్డులా 'నా సంసారాన్ని నిలబెట్టండి, నా సంసారాన్ని నిలబెట్టండి'.... మళ్ళీ ఆ ముక్క అంటే నీ సంసారాన్ని కూలదీస్తాను. కుమ్మేస్తాను. జాగ్రత్త".

శివరావు టక్కున నోరుమూసుకున్నాడు. ఒక ఫోటో, ఓ యిన్ఫర్మేషన్ లిస్టూ బాబూరావుకి యిచ్చాడు. అతని మరదలు అమెరికా నుండి స్టీలు కంచం పంపించినప్పుడు వాటిని కూడా పోస్టు చేసిందట.

బాబూరావు_ రాజాని పిలిచి, సంగతంతా చెప్పాడు.

ఆ యింటి స్టీలుప్లాంట్‌లో వెదికి, శివరావు అమెరికన్ 'ఒక్కచిప్ప' తెచ్చేసరికి సరిగ్గా యిరవై నిమిషాలు రాజాకి పట్టింది.


ఆ సమయంలో కాంతం నిద్రపోతూ, స్టీలు కలలు కంటుంది.

* * * *

చాలాకాలం తర్వాత బాబూరావు, కిరీటిరావు కలుసుకున్నారు. వాళ్ళిద్దరూ చిన్నప్పట్నుంచి స్నేహితులు. భోజనానికి ఇంటికి రావాలని బాబూరావు పట్టుబట్టేసరికి, డ్యూటీకి హాఫ్ డే డుమా కొట్టి, వెళ్ళక తప్పలేదు కిరీటిరావుకి.

"కాంతం! వీడు కిరీటిరావని నా చైల్డ్‌హుడ్ ఫ్రెండ్. చిన్నప్పుడు పెన్సిళ్ళూ పుస్తకాలు దొంగలాడే వెధవ యిప్పుడు పెద్ద పోలీసాఫీసరు అయిపోయాడు."

"వీడు మాత్రం తక్కువ తిన్నాడా, అమ్మా? ఇంతప్పుడు ఇంటిమీద రాయి



వేసి, వీపు పక్షి వెధవ యిప్పుడు పెద్ద బుద్ధిమంతుడై పోయాడు."

ఆ పరిచయాలకి కాంతం నవ్వకుండా ఉండలేకపోయింది.

కాంతం వంట ప్రయత్నం సాగించగా, స్నేహితులిద్దరూ కబుర్లలో పడిపోయారు.

"ఏరా, మీ పిల్లా పిచుక ఎక్కడా కనిపించరే?" కిరీటిరావు_ ఇంట్లో పిల్లలెవరూ కనిపించకపోయేసరికి అడిగాడు.

"చిక్కగా నారునాటితే పంటపండదు అందుకే, మేమిద్దరం, మా కిద్దరూ.... నంబర్ వన్: అమ్మాయి. సుధారాణి. మెడిసిన్ చదువుతోంది. హాస్టల్లో ఉంటుంది. నంబరు టూ: అబ్బాయి. ఇంటరు సెకెండియర్. మరి కాసేపట్లో ఇంట్లో వాలుతాడు." మొత్తానికి బాబూరావు రేడియో రాముడనిపించుకున్నాడు.

అంతలో రాజా వచ్చి, స్కూటరు రిపేరు పూర్తయిందని వాళ్ళ నాన్నకి చెప్పాడు.

"సకాలంలో మరామ్మత్తు చేస్తే, ఏదయినా సవ్యంగానే పనిచేస్తుందయ్యా! వెర్రిబాగులవాడు మీ నాన్నకి తెలీదు."

కిరీటిరావంకుల్ మాటకి రాజా బొటనవ్రేలు ఎత్తి 'కరక్టు' అన్నట్లు గాలిలో ఊపాడు.

కాంతం వడ్డనచేసి, అందర్నీ భోజనాలకి పిలిచింది. డైనింగు టేబిల్ మీద అందరిముందు స్టీలుపాత్రల్లో పదార్థాలు ఉండగా, ఒక్క బాబూరావు వేరుగా విస్తరిలో భోంచేయడం కిరీటిరావు గమనించనేలేదు.

"ఓహోహో.... ఏం స్టీలుపాత్రలు. ఎన్ని సామాన్లు.... వంటింట్లో డైనింగు హాల్లో, చివరికి బాత్రూంలో కూడా స్టీల్ వేరే.... రకరకాల గిన్నెలు, కంచాలు, గ్లాసులు, గంగాళాలు, చెంబులు, చెంచాలు.... ఆహాహా.... పోపు డబ్బాలు, కత్తిపీటలు.... కన్నులపండుగ. ఫాంటాస్టిక్. మార్వలెస్. ఒక స్టీలు మ్యూజియంను చూసిన అనుభూతి కలిగిందోయ్" కిరీటిరావు తెగ పొగిడేస్తున్నారు.

ఆ పొగడ్తలకి కాంతం కాస్తయిబ్బంది పడింది కూడా.

"మ్యూజియం కోసం దేశవిదేశాల నుండి వింత వింత వస్తువులు సేకరించిన సాలారుజంగు గారికి మా ఆవిడ కజిన్ సిస్టర్రా" బాబూరావు వ్యంగ్యంగా అన్నాడు.

"అమ్మా! వీడు నిన్ను సరిగ్గా చూస్తున్నాడా?"

"చూడకేం అన్నయ్యగారూ! మాట వస్తే చాలు_ పనికిమాలిన దరిద్రగొట్టు పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ.... అంటూ శాపనార్థాలు పెడతారు."

"వీడే?.... ఒరేయ్! మళ్ళీ అలాంటి మాటలు మాస్తే, నీమీద కేసు బనాయిస్తాను జాగ్రత్త."

'కాంతం ఫిర్యాదు_ కిరీటిరావు హెచ్చరిక' వాటిని బాబూరావు గాల్లోకి 'ఉఫ్' అని వదిలాడు.

చెయ్యి తుడుచుకుంటూ, డైనింగు టేబిలుకి పక్కగా ఉన్న పెద్ద అలమరాలో స్టీలుసామాన్లు చూసి, కిరీటిరావు స్టిల్లయిపోయాడు. చాలా పరీక్షగా, నిశితంగా, ప్రతి వస్తువును గుచ్చి గుచ్చి చూశాడు. అతని కనుబొమలు ముడి పడ్డాయి. ఇందాకటి సరదా, నవ్వూ మచ్చుకైనా అతని ముఖంలో మిగల్లేదు.

ఒన్ మినిట్ పాజ్.

"ఈ అలమరాలో కనిపిస్తున్న స్టీలు పాత్రలు ఎప్పుడుతీసుకున్నారు? ఎక్కడ తీసుకున్నారు?" కిరీటిరావు మాటల్లో కరుకుదనం ధ్వనించేసరికి_ బాబూరావు, కాంతం తెల్లబోయారు.

పదిరోజుల క్రిందట బాబూరావు, జీతం రోజున అతనికి తెలియకుండా అయిదొందలు తీసి, మరో అయిదొందలు అప్పుచేసి_ పెద్ద బజారులో డాంగ్‌మియా గారి షాపులో ఆ స్టీలువస్తువులు కాంతం కొంది. ఆ మాటే అతనితో చెప్పింది.

కిరీటిరావు రసీదులు చూపించమని అడిగాడు.

సాధారణంగా కాంతం ఏ వస్తువు కొన్నప్పటికీ రసీదులు అడిగి పుచ్చుకోదు. ఎందుకంటే_ అంత పెద్ద మొత్తం బిల్లుచూస్తే, బాబూరావు శివతాండవం చేస్తాడు. ఆ ఫ్యాక్ట్ ఫ్రెండ్‌తో చెప్పాడు.

"అయాం సారీ! ఇవన్నీ నే నెందుకు అడుగుతున్నానంటే...."

కిరీటిరావు చెప్పిన ఫ్లాష్‌బేక్ కథ యిది.

"రెండు నెలల కిందట పాతిక వేల రూపాయల దొంగసరుకు రవాణా జరిగింది. పోలీసులకు విషయం తెలిసేసరికి డాంగ్‌మియా లాంటి పెద్ద పెద్ద వ్యాపారస్తులు కొన్న దొంగసరుకును చిల్లరమల్లరగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. వాళ్ల చేతుల్లో కొంచెం కూడా మట్టిలేకుండా చేసుకున్నారు. అంచేత— పోలీసు డిపార్టుమెంటు ఇంటింటిని గాలిస్తోంది. కర్మకాలి ఆ దొంగ బాపతు కొంత భాగం స్నేహితుడి ఇంట్లో ఉండటం, అది కిరీటిరావు కళ్ళలో పడటం యాదృచ్ఛికంగా జరిగింది.

అతిధిగా వచ్చి, అరాచకం జరుపుతున్నందుకు కిరీటిరావు మీద కాంతానికి పట్టరాని కోపం వచ్చింది.

"అన్యాయం. మా సంపద చూసి, మీరు కన్నుకుట్టుకుంటున్నారు. చేతనైతే, ఆ డాంగ్‌మియాగాడ్ని పట్టుకొండి."

"అతన్ని పట్టుకోవడానికి మొదట మీ దగ్గర రసీదులు ఉండాలి కదా? అయినా— దొంగ సరుకును అమ్మేవాళ్లతో బాటు కొనేవాళ్లను కూడా చట్టం క్షమించదు."

"ఏఁవిటోయ్: ఏదో స్నేహితుడువని పిలిస్తే, నువ్విలా ఫాల్స్ కేసు బనాయించడం ఏఁ బావులేదు." బాబూరావు స్నేహితుడ్ని నిందించాడు.

"నో....నో.... స్నేహాన్నీ ధర్మాన్నీ వేరువేరు అద్దాలతో చూసే మనిషిని. నేను పోలీసాఫీసర్ని."

బ్రతిమాలినా, బామాలినా, పొగిడినా, తెగిడినా, చేతులు పట్టుకున్నా, కాళ్లు పట్టుకొన్నా ప్రయోజనం లేకపోయింది. కిరీటిరావు ససేమిరా అన్నాడు. మరీ బిగుసుకుపోయి, ఫోజు కొట్టేశాడు.

కాంతం అపరకాళికలా రౌద్రరూపం దాల్చింది. కిరీటిరావును గుమ్మం దిగిపొమ్మంది. లేపోతే— చీపురుతో చిదకబాదుతానంది.

"మీరు మొండితనం చూపిస్తే, నా డ్యూటీ నేను చేస్తాను. ఇద్దరు పోలీసుల్ని రప్పించి, ఈ వీధిలో అందరికీ తెలిసేలా మీ ఆయన రెండు చేతులకి బేడీలు వేయించి, స్టేషన్‌కితీసుకెళ్తాను. జెయిల్లో వేస్తాను. ఇన్ని జరిగిన తర్వాత మీ ఆయన ఉద్యోగం కాస్తా ఊడుతుంది."

కిరీటిరావు విడమరిచి చెప్పేసరికి ఒక్కక్షణం అంతా అవాక్కయిపోయారు.

మొదట తేరుకున్నది బాబూరావు. కాంతాన్ని తిట్టిపోశాడు.

"నీకు మొదట్నుంచీ చెప్తున్నాను. పనికిమాలిన, దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, బ్లడీ, నేస్టీ, దుబారాచేసి, కొంపను కొల్లేరు పాలు చెయ్యొద్దని. నా మాట విన్నావా? ఇప్పుడు చూడు!.... నా ఉద్యోగం ఊడితే, నువ్వు సంపాదించిన ఈ చిప్పలే అమ్ముకొని మనం బతకాలి."

కాంతం కన్నీళ్ళకి ఎదమీద పయ్యెద తడిసి ముద్దయిపోయింది.

"నా ముచ్చట ఈ ఇంటికి ముప్పు తెస్తుందనుకోలేదు. నా సరదా ఈ సంసారాన్ని వీధి కెక్కిస్తుందనుకోలేదు."

"ఒరేయ్, కిరీటిరావూ! ఇవి చేతులు కావు. రభసచేసి, నా కన్యాయం చేయకు. ఇదిగో— యివన్నీ తీసుకొని, మా రాజా నీతో స్టేషన్‌కి వస్తాడు. ఆ తర్వాత వ్యవహారం ఏవిటో చూడు. ఈ సాయం చేసి, పుణ్యం కట్టుకోరా...." కిరీటిరావు చేతులు; గెడ్డం పుచ్చుకొని, అమాయకమైన ఫోజొకటి పారేసి, మరోసారి బ్రతిమాలాడు, బాబూరావు.

"ఆల్‌రైట్.... ఆల్‌రైట్.... రాజా! అవన్నీ ప్యాక్‌చేయవోయ్ తొందరగా" అని కిరీటిరావు పని పురమాయించాడు.

అవసరం ఉన్నవి ఉంచి, మిగిలిన స్టీలుపాత్రలు కూడా అమ్మించేయమని చెప్పి, అక్కడ్నుంచి కాంతం నిష్క్రమించింది.

కాసేపు నిశ్శబ్దం చోటు చేసుకుంది.

ఆ డెడ్లీ సైలెన్సుని బ్రేక్‌చేస్తూ బాబూరావు— "ఒరేయ్ కిరీటీ; థాంక్స్‌రా. అద్భుతంగా నటించావు. ఈ ఇంటి దుబారా రాక్షసుడికి గాభరా పుట్టింది. మా సంసారం బాగుపడుతుంది. నువ్వు చేసిన ఉపకారానికి ఆజన్మాంతం...." అని కిరీటిరావుని హైలైట్ చేస్తూ కంగ్రాట్సు చెప్పబోయాడు.

"ఒరేయ్.... ఒరేయ్.... పనికిమాలిన, దరిద్రగొట్టు, పింజారీ, చండాలపు, యూస్‌లెస్, డర్టీ, బ్లడీ, నేస్టీ పొగడ్తలు చెప్తే నీ డొక్క చీరేస్తాను." అని కిరీటిరావు రెండు వేళ్లతో బాబూరావు డొక్కలో నెమ్మదిగా పొడిచాడు.

అందరూ నవ్వేరు, ఒక్క కాంతం తప్ప.